
# గోపాలంగాని పెండ్లాం

ఆచార్య. ఎమ్. కె. దేవకి



ఉన్నట్లుండి గలాంబులాం అని అరుపులినిపిత్తే ఏమైందబ్బా అని సేతిలో పనిడిసి ఈదిలోకి పరిగెత్తినాను.

అప్పటికే ఎక్కణ్ణుంచో వచ్చి సిన్నప్పట్నించి మా యింట్లోనే పెరిగి పెద్దదైన సంపూర్ణకు ఇషయం తెలిసిందేమో, మాకు సెప్పాలనే ఆత్రంలో గసబోసుకుంటా పడతా లేస్తా పరిగెత్తుకుంటూ వస్తావుంది.

ఆ బిడ్డ్ని సూడంగానే అంతకంటే ఆత్రంగా ''ఏంది సంపూర్ణా ఆడ ఏడుపులు తూడుపులు'' అని ఆ బిడ్డ సెప్పేదాకా వుండబట్లేక అడిగినాను.

''గోపాలం గాని కూతురు బాయిలో పడిపోయిందంటకా'' అనింది ఒగురుస్కుంటానే.

ఆ బిడ్డ నోట్లో మాట నోట్లో వుండంగానే ''అయ్యో కొడకా! ఏమయిందంటా. తెల్లారి గూడా మన బాయిలో నీళ్లు సేందుకోని బొయ్యిందే'' అన్న్యా.

''మద్దేనం కాడ సంగటిదిని వాళ్లవ్వ, నాయిన కట్టేగాలవ కాడ గుడ్లుతకతా వుంటే వాళ్లకు సంగటి కూడా దీస్కొని బోయిందంటా. ఆడికిపోయిన బిడ్డ ఆణ్ణే వుండకుండా పెడాత్తం గాకపోతే కన్నమోల బాయికాడికి ఎందుకు బోవాల, వాళ్ల సెట్లో పూలెందుగ్గోయాల..'' సంపూర్ణ మాటల్లో 'అయ్యో! అంటా వుందా, తిడ్తావుందా' అర్తం గాలా.

''ఇంతకూ ఆ బిడ్డ కిప్పుడెట్లా వుంది'' అని అడిగినాను.

''అయ్యో రామ. ఇంగా యాడుంది. సచ్చిపోయి పీనిగిని కూడా ఇంటికేసకొస్తే'' అని సంపూర్ణ అనంగానే గోపాలం గానింటికి పరుగుబెట్న్యాను.

నే బోయ్యేటప్పటికీ ఆడంతా ఆలగోడు బాలగోడుగా వుంది. వాళ్లమ్మ, అవ్వ పీనిగి మిందబడి లబోదిబోమని కొట్టుకుంటా వుండారు. గోపాలంగాడైతే ఆడదానికంటే కనాకష్టంగా పీనిగి మింద బడి యాడత్తా వుండాడు.

ఇంతట్లోకి పక్కూర్లోనే వుండే వాళ్లత్తొచ్చింది. ఆయమ్మ గోపాలంగాని కంటే ఐదారేండ్లు పెద్దది. ఆయమ్మ రావడం సూడంగానే ఆడున్నోళ్లంతా గొల్లుమన్న్యారు. ఆ ఏడుపులిని యాడుండే వాళ్లా అప్పటికే సూసిపోయినోళ్లు కూడా మళ్లీ పరిగెత్తుకొచ్చినారు. ఆయమ్మ కంటికి కడివెడుగా యాడత్తానే ''ఏమొచ్చిందిరా మీకు సేటుగాలం. బంగారట్లా బిడ్డి బాయిపాల్జేసినారు'' అని తమ్ముణ్ని, వాడి పెండ్లాన్ని దబాదబా బాది కడుపు మింద, తల మింద మొత్తుకుంటా తసుక్కున తలబట్టుకోని యాడస్తా నేలమింద కూలబడిపోయింది.

గోపాలంగాని పెండ్లామైతే దుక్కాణ్ణి తట్టుకోలేక యాడత్తా వాళ్లాడబిడ్డి కాళ్లమింద బడిపోయింది. ఆయమ్మ కూడా తమ్ముని పెండ్లాన్ని వాటేసుకోని గట్టిగా పాడిపాడి యాడ్వబట్టింది. ఉన్నట్లుండి ఆడ ఏడుపులు ఎక్కువై పోయినాయి.

''ఓయమ్మో – ఓర్నాయినో నా బిడ్డి పోగొట్టుకోని నేనెట్లా బతికేదిరా దేముడో'' అంటా కన్న కూతుర్ని ముద్దు బెట్టుకోని ఎంటికలు పెరుక్కోని, కడుపు మింద బాదుకోని, తలకాయి మింద మొత్తుకోని కన్నీరు మున్నీరుగా యాడత్తా వుండే గోపాలంగాని పెండ్లాన్ని జూసి కటినాత్ముల కండ్లలో కూడా నీళ్లు దిరిగినాయి.

''సేతికెదిగొచ్చిన సెట్టంత కూతురు సచ్చిపోతే ఆ బాదను తట్టుకోడం ఎవురికి మాత్తరం సాద్దెమవుతుందిలే'' అని ఎగవింటోళ్ల కమలక్క కండ్లలో నీళ్లు బెట్టుకునింది. ఆడుండే వోళ్లంతా ఒకొకురొకొక మాట సెప్పడం మొదలు బెట్న్యారు.

''మొన్న గూడా గొబ్బి దడ్తా మా యింటి కొచ్చింది. కొత్త గుడ్లెత్తుకోలేదా పాపా అన్న్యాను. మాయమ్మ మళ్లీ కుట్టిస్తాననింది అని మురిసిపోతా సెప్పింది'' అని ఈశినేరోళ్ల యశోదత్త పొన్నెక్కతో అనింది.

''మా యింటికి గొబ్బిదట్లొనచ్చినబుడు మా మామొచ్చుండాడు పాపా మంచి పాటపాడు'' అన్న్యానో లేదో

'మా మొచ్చినాడమ్మ మా మొచ్చినాడు
యాలొచ్చి నాడమ్మ యాలొచ్చినాడు
నట్టింటి పుల్ల్యాకు నాకనొచ్చినాడు' అని పాడి వాడి దెగ్గర రూపాయి గుంజుకునింది. అందరు నవ్వీ నవ్వీ సచ్చినాము'' అని వాళ్ల పక్కింటి అబ్బాగాని పెండ్లాం ఇవరంగా సెప్తావుంటే కండ్లలో నీళ్లు కార్చుకుంటా ఇంటా వుండారు ఆడుండే ఆడంగులు.

ఆ మాటలు సెవుల్లో బడంగానే ''నాయమ్మో, నా బంగారు తల్లో, గొబ్బియాల పండక్కు కొత్త పావడ కుట్టియలేదని ఏడిత్తే సావగొట్న్యానమ్మా నా బంగారు బిడ్డి. ఒక దినమంతా కూడూ నీళ్లు ముట్టుకోకుండా ఏడ్చిందమ్మా నా తల్లి. నా సేతులకు పుండుపట్న్యాని, నా కడుపు కాలిపోనానీ...

''నా కూతురా. నీకు కొత్త పావడ కుట్టిస్తానే. నీకు సెంపపిన్నులు తీసిస్తానే. నీకు తిలకం బుడ్డీ తెచ్చిస్తానే. నీకు కాటిక డబ్బీ కొనిత్తానే'' అని దీర్ఘాలు తీస్తా పండక్కి తొడిగించిన కూతురు సేతిలోని గాజుల్ని సూసి పట్టుకోని గెట్టిగా ''నా బిడ్డ సెయ్యి ఎముకలేని ఎన్నమాదిరి సెయ్యని గాజుల తాత కూడా మెచ్చుకున్న్యాడే నాయమ్మో! నా తల్లే! ఓరి పాపిష్టి దేవుడో! నన్ను సంపుకుపోరాబ్బా!'' అని దబా దబా రెండు సేతుల్తో తల గొట్టుకోని వున్నెంట్లుండి గప్‌చిప్‌గా మాటా పలుకు లేకుండా ఎర్రి సూపులు సూత్తా కూకుండిపోయిందా బిడ్డ తల్లి.

నా కన్నా... నా బంగారూ... ఇట్లాంటి మనుసుల దెగ్గిర వుండకూడదని ఎల్లిపోయినావా తల్లీ... నేనింకా ఎవుర్ని గొడ్డను... నేనింక ఎవుర్ని తిడ్డను... పాపిస్టి దాన్ని దాని దుడ్లు దిగమింగి దాన్నే గొట్న్యానమ్మా''అంటా వాళ్లమ్మ కూతురి మూతిని తడిమి తడిమి ముద్దు బెట్టుకుంటా, కడుప్పిసుక్కుంటా యాడత్తా వుంటే అక్కడుండే వోళ్ల కండ్లలోంచి కాలవలో నీళ్లు పల్లానికి దూకినట్లుగా సెంపల మిందికి జారకొచ్చినాయి. నాకయితే కడుపులో సెయిబెట్టి దేవినట్లయింది.

''బంగారు బిడ్డెమ్మా నా మనమరాలు. సేతులు బొయ్యేట్లు సెనిక్కాయలు పెరికి దుడ్లు కూడ బెట్టుకొనింది. గొబ్బి దట్ని దుడ్లు ఐదున్నర రూపాయిలొచ్చింది'' 'హాఁ' అని సీది కోడలు ఏడత్తా సెప్పిన మాటల్ని ఇవరించడం మొదలుబెట్టింది వాళ్లవ్వనాగి.

''ఎరగెడ్ల పూల పావడ కొనియమని – ఆ దుడ్లు గుడ్డలో గట్టుకోని – డబ్బీలో బెట్టుకోని ఎత్తి పెట్టమని నా సేతికిచ్చిందెయమ్మా'' ఏడ్చే శక్తి కూడా లేక మాటల్ని తుంచి తుంచి సెప్తా పాడి పాడి యాడస్తా వుంది వాళ్లవ్వనాగి.

''నా కూతురా. నీకు కొత్త పావడ కుట్టిస్తానే. నీకు సెంపపిన్నులు తీసిస్తానే. నీకు తిలకం బుడ్డీ తెచ్చిస్తానే. నీకు కాటిక డబ్బీ కొనిత్తానే'' అని దీర్ఘాలు తీస్తా పండక్కి తొడిగించిన కూతురు సేతిలోని గాజుల్ని సూసి పట్టుకోని గెట్టిగా ''నా బిడ్డ సెయ్యి ఎముకలేని ఎన్నమాదిరి సెయ్యని గాజుల తాత కూడా మెచ్చుకున్న్యాడే నాయమ్మో! నా తల్లే! ఓరి పాపిష్టి దేవుడో! నన్ను సంపుకుపోరాబ్బా!'' అని దబా దబా రెండు సేతుల్తో తల గొట్టుకోని వున్నెంట్లుండి గప్‌చిప్‌గా మాటా పలుకు లేకుండా ఎర్రి సూపులు సూత్తా కూకుండిపోయిందా బిడ్డ తల్లి.

గోపాలం గాని పెండ్లాన్ని సూత్తా వుంటే నిజంగానే శానా బాదగా వుంది. సంసారలంపటాన్ని నెత్తినేసుకొని ఈడ్సి ఈడ్సి మనిసి సగమై పోయింది. ఇంగిప్పుడేమైపోతాదో అన్పించింది.

పద్నాలుగేండ్లనాటి మాట. గోపాలం గాడికి పెండ్లి కుదిరిందని తెలిసి వూరూ వాడంతా ముక్కు మింద వేలేసుకునింది. అంత తిక్క మాలోకానికి బిడ్డి ఎవురిస్తావుండేది అని అడగనోళ్లు పాపాత్ములు.

వాడెంత ఎర్రిబాగులోడంటే– నేను మా యవ్వోలింట్లో వుండి మావూరి ఇస్కూల్లో ఐదో తరగతి సదువుకుంటా వున్నప్పటి కతది.

అప్పుడు గోపాలంగాడు ఎదురుబట్టి భుజం మింద బెట్టుకోని మా యవ్వోలింటికి సంగటి యాసకపోను వొచ్చేవాడు. సాకలోళ్లకి దినాము ముద్దసంగటేసి ఒక గెంటికూర పోయడం మావూరి పద్ధతి. అట్లా గుడ్డితికే ఇండ్లలో ఏసే సంగటీ, పోసే కూరే వాళ్లకు ఎక్కా తుక్కా అయిపోయేది. మిగిలింది గొడ్లకుడిత్లో పోసేవోళ్లు. ఏ పెండ్లో పేరంటమో, సుట్టాలో పక్కాలో ఒస్తేనే వాళ్ల పాయిలో పిల్లి లేసేది.

గోపాలం గాణ్ణి జూస్తే అందరికీ కుశాలంగా వుండేది. ఆ ఎర్రి మాలోకాన్ని పిలకాయిలు మొదలుకోని పెద్దోళ్లదాకా మాట్లాడించి వాడేదన్నా అంటే ఎగతాళిసేస్తా నవ్వుకొనేటోళ్లు. తమాసాకు ''గోపాలా మీ కూరంత బోస్తావా?'' అంటే ''పూఁ మాయమ్మ పొరక దిరగేస్తాది. నే బొయ్యను'' అనేవాడు. ఒకసారి గంగ పండక్కు ఊర్లో యాట్లు గొట్న్యారు. మా యవ్వోలింటి పక్కనుండే కిష్టారెడ్డోలింట్లో అన్నమేసుకోని వాళ్లు బోసిన యాట కూరలోని బుర్రెమికిని సప్పరించుకుంటా మా యవ్వోలింటి కొచ్చినాడు. అప్పుడు మా తాత అన్నం దింటా వుండాడు. వాడు సప్పరిస్తా వొచ్చిన బుర్రెమికిని వొచ్చీరాంగానే మా తాత అన్నం తింటా వుండే గిన్నిలోకి ఇసిరేసినాడు. మా తాత వాన్ని కొట్ను కొట్ను బోయినాడు. ''శానా బాగుండాది రెడ్డీ. బుర్రెమికిని రాయితో గొట్టుకో, మూలిగిని తిను. ఎవురికీ ఇయ్యొద్దు. సరేనా!'' అని సెప్పిన గోపాలంగాని ఎర్రిబాగుల తనానికి ఏడ్వాలో నవ్వాలో తెలీకపోయినా ఆ ఇసయాన్ని ఊరూవాడంతా కతగా సెప్పుకోని నవ్వుకు

న్నారు. అది జరిగినప్పుడు గోపాలం పసిపిలగాడా అనుకుంటే పప్పులో కాలేసినట్లే. గోపాలం అప్పిటికే పెండ్లి కెదిగినాడు. మూతి మింద మీసం మొలిసిన మొగోడు.

గోపాలం గానికి, వాళ్ల తమ్ముడు నర్సిమ్మానికి ఒకేతూరి తిర్నానూర్లో పెండ్లయింది. ఇద్దరు కొత్త కోడాండ్లు ఒకేతూరి మా వూర్లో అడుగుబెట్నారు.

ఎంత సావకారింటి ఆడబిడ్డయినా మా వూరికి కోడాండ్లుగా వొచ్చినోళ్లు మా బాయికి నీళ్లు సేందుకోను రావాల్సిందే. ఆ వూరికంతా మా బాయొగిటే మంచినీళ్లబాయి. అత్తగారింట్లో అడుగుబెట్టిన కొత్త కోడాండ్లిద్దరూ కడవలెత్తుకోని మా బాయికి రానే వొచ్చినారు. పెండ్లి కలతో, పసుబ్బూసిన మొగాలతో ఇద్దురూ ఇంకా ఇంకా సూద్దామా అనేట్టుండారు. ''సూత్తే పెండ్లికలను పేదోళ్లోనే సూడాల. ఒంటినిండా నగలు దిగేసుకోని దినాము మంచి మంచి కోకలు గట్టుకొనే వోళ్లలో ఆ కల కన్పించదు'' అని వాళ్లిద్దుర్ని సూసి నేను, మాయక్క అనుకున్నాము కూడా.

సెవుల్కి కమ్మలు జింకీలు, మెళ్లో పసుప్పచ్చగా మెరిసిపోతావున్ని పసుపుతాడు, దారంలో గుచ్చిన నల్లపూసలు, కాళ్లకు ఎండిసైనాలు సూసే కొద్దీ ఇంగా సూద్దామా అనేట్లుగా వుండారు. వాళ్ల తలల్లో వాడిపోయున్న మల్లెలు పెండ్లి కూతురు వాసనేత్తా వుంది.

ఒగాయమ్మ నీళ్లు సేంది పోత్తే ఇంగోకాయమ్మ ఇంట్లో పోసాస్తావుంది. వాళ్లిద్దురితో వాళ్ల పెద్దాడబిడ్డ సాయిత్రి కూడా నీళ్ల కడవ మార్సుకునింది.

నీళ్ల పని ముగించుకోని వాళ్లు బొయినాక కొయిలగోపి మాదిరగా వుండే సిన్నోడి పెండ్లాం కంటే కూడా తిక్క గోపాలం గాని పెండ్లామే బాగుందని ఆడునోళ్లందరూ అనుకున్నారు.

అప్పట్నుంచి ఎర్రిబాగులోడిలో యాగతా సంసారలంపటాన్నంతా నెత్తికేసుకోని తన మానాన తానుండే గోపాలంగాని పెండ్లాన్ని సూసి కండ్ల నీళ్లు బెట్టనోళ్లు పాపాత్ములు.

పెండ్లయిన సమత్సరానికే నాగి సిన్నకొడుకు, కోడలు సిత్తూరులో కాపురం బెట్నారు. ఊర్లో పదిపన్నెండిండ్లలో గుడ్లుతికి మొగుణ్ణి, అత్తమామల్ని, ఆడ బిడ్లని ఆదరిస్తా వొడుపుగా సంసారాన్ని నెగ్గకొస్తా వుండే గోపాలంగాని పెండ్లాం నెత్తిన ఇప్పుడీ పిడుగుబడింది.

సచ్చిన బిడ్డ సదువు రొండో తరగతిలోనే అటకెక్కింది. అద్దైనా ఆడికోనాడు అమాసకోనాడే ఆ బిడ్డ ఇస్కూలు మొగం సూసింది. ఇంట్లో వోళ్లు వూరి గుడ్లుతకను ఏటికి బోతే సిన్న పిల్లకాయల్ని సూసుకొనే వోళ్లు లేరని ఇస్కూలు మాన్పించినారు. ఇద్దురు తమ్ముళ్లని, ఒక సెల్లిని తల్లికంటే ఎక్కువగా ఆ బిడ్డే సాకి సంతరించింది. వాళ్ల మూతి కడిగి, ముడ్డి కడిగి, యాలకింత సంగటి తినిపించి ఇంతోళ్లను అంతోళ్లను సేసింది. అందుకే 'అకా, అకా' అని ఆ పిలకాయలు వూపిరాడకుండా కొట్టుకుంటా వుండారు.

అక్కడుండే వొళ్లావురో అన్నారు. ''పాపం పొంగిటి పండక్కి ఆ బిడ్డ వాకిట్లో ఏసిన ముగ్గు కూడా అట్నే వుంది. ఇంతలోనే ఆ బిడ్నీ ముండా దేముడీడ్సుకోని బోయినాడు'' అని. అంతే బిలోమని అయిదారుమంది వాకిట్లోకి పరిగెత్తినారు. పచ్చని పేడతో అలికి రదం ముగ్గేసిరంగులు కూడా పూసిందా బిడ్డి.

వాళ్ల పక్కింటి రంగమ్మత్త ''కొడకా రదంలో కూసోని దేముని దెగ్గరికి బోతివా నాయినా'' అని ముగ్గు దెగ్గిర కూలబడి ఏడ్వడం మొదలుబెట్టింది.

''ఇంతకూ ఆ బిడ్డి బాయిలోకి ఎట్లాపడింది'' అని అప్పుడే వొచ్చిన అమరక్క అడిగిన పెశ్నకు పుస్పావతి బొదులు జెప్పింది.

''ఈ పొద్దు పొంగిలి బెట్టే పండగ్గదా! నిన్న కుంచిల్దోలినారా! ఎద్దుల్ని బాయికాడ కడిగి, కొమ్ములు జివిరి, రంగుబూసి సాయిడబ్బీ ఆణ్నే మర్సిపోయినారంట. ఇంకా కొంచెం సాయి మిగిలుంటే ఆణ్నే వుడ్సేసాచ్చినారని వాళ్లవ్వ పిలకాయిల్ని దిట్టిందంట. ఆ సాయిడబ్బీ తెచ్చుకుంటే గోర్లకు బెట్టుకోవచ్చని మునాస పడిందీ బిడ్డి. ఏటి దెగ్గిర వాళ్లవ్వోళ్లకు కూడుబెట్టి బాయిదెగ్గరికి బోయిందంట. డబ్బీ దొరికినట్లు లేదు. బాయిగెడ్డనుండే మైసూరు మల్లిపూలుపైన మనసు బోయినట్లుంది. సాయంత్రం పొంగిలెత్తుకోని బొయ్యేటప్పుడు పెట్టుకోవచ్చని ఆశపడినట్లుంది. బాయిలోకుండే గుత్తి కోసుకోను ఒంగి జారిపడిపోయింది. బాయిగెడ్న కాల్జారిన గుర్తుగాని వుందంట.''

> సెవుల్కి కమ్మలు జింకీలు, మెళ్లో పసుప్పచ్చగా మెరిసిపోతావున్ని పసుపుతాడు, దారంలో గుచ్చిన నల్లపూసలు, కాళ్లకు ఎండి సైనాలు సూసే కొద్దీ ఇంగా సూద్దామా అనేట్లుగా వుండారు. వాళ్ల తలల్లో వాడిపోయున్న మల్లెలు పెండ్లి కూతురు వాసనేత్తా వున్నాయి.

''ఆ బిడ్నీ మిత్తివి గొట్టేసుంటుంది'' ఆ బాయికాడుండే మావిడి సెట్టుకే గదా రంగపిల్ల వురిబోసుకునింది'' అనింది సాలమ్మ.

''పాపం పండక్కు కొత్త గుడ్లు కుట్టించుకోవాలని ఎంత పోర్కలాడిందని. ఇంట్లో గిన్నే సెంబులోమ్కోని, సెల్తోసుకోని, బాయిలో నీళ్లు సేదకొచ్చుకోని, పిలకాయిల్ని సూసుకుంటా సేతులు బొబ్బలు బోయేట్ల సెనిక్కాలు పెరికి నలబై రూపాయలు నేర్చిపెట్టింది. అన్నెకారి గవర్మెంటు బాయికి కరెంటు శార్జీ గట్లేదని గొంతుమింద కూసుకంటే వాళ్లమ్మ సెవుల్లో కమ్మలమ్మి ఈ బిడ్డ కష్టాన్ని కూడా కలిపి ఆ కరెంటు ముండా కొడుకు ఎదాన గొట్నారు'' ఎంతో బాదగా ఎత్తిరాజులుగాని పెండ్లాం సెప్పింది. ఆ బిడ్డి కామికూడా ఒక పిన్నమ్మ.

''పాడు బూముల్లో పండింది గిండింది లేదు గానీ ఊరికే వుండే పేనాన్ని ఉపద్రబెట్టినట్లు ఇంట్లో గింజల్ని మంట్లో బోసి కరెంటు శార్జీలు గట్టి అప్పులపాలై సత్తా వుండాము'' అని పుస్పావతి బాదపడింది.

''పాపం పండక్కి పిలకాయలందరికి కొత్త గుడ్లెత్తియ్యమని ఎంత పారకలాడిందా బిడ్డి. ఆ యాస తీరకుండా బోయేసరికి ఆ బిడ్డి మనసు ఎంత అంగలార్సిందని'' మళ్లీ వాళ్ల పిన్నమ్మ గోడు గోడు మనింది.

''సిన్న వయసులో జీవితంతో రాజీపడే బతుకులు. రెండు పూలకు ఆసపడినందుకు ఆ బిడ్డి పేనాలే పోయినాయి. ఆ దేముడు కూడా పేదోళ్ల బతుకుల్తోనే ఆట్లాడుకుండేది. సేతికందిన బిడ్నీ పోగొట్టుకోని వాళ్లా బాదెట్లా మర్సిపోయేది'' అనుకుంటా ఇల్లుసేరినాను. ఆ సాయింత్రమే ఆ బిడ్నీ మంటి పాల్జేసినారు. పండగ్గైనా వూర్లో ఎవరూ పొంగిలి బెట్లేదు.

మూడోనాడు తెల్లారి లేసి కల్లాపి సల్లతా వుండాను. ఉన్నట్లుండి గలాంబులామని మళ్లీ అరుపులు. ఏమయిందబ్బా అనుకోని ఈదిలోకి పరిగెత్తినాను.

''గోపాలంగాని పెండ్లాము కూతురు పడిన బాయిలోకి దూకేసిందంట'' అని ఎవరో సెప్తే అంతా ఆ పక్కకు పరిగెత్తతా వుండారు.

''కడుపు కోతను ఓర్సుకోవడం కష్టమని ఆ బిడ్డి సచ్చినాట్నుంచి యాడో ఒక మూలగా మిగిలిపోయిన బాద వున్నట్లుండి గప్పున సల్లారినట్లయింది నాకు. కానీ ఎంటనే మిగిలిన పిలకాయిలు దిక్కులేని అనాదల మాదిరి కండ్లముందు కదలాడినారు. మళ్లీ కడుపులో సెప్పలేనంత బాద మెదలాడింది. మనసుండబట్టలేక ఈది లోకి పరిగెత్తినాను.

నడీదిలో గుంపు. నాక్కొంచెం ముందుగా నాగి ''ఎవర్నేం జేయాలని ఇట్టాంటి పాడు పనులు తల్లీ'' అంటా ఉరికెత్తతా వుంది.

మేం బొయ్యేపాటికి గోపాలం గాని పెండ్లాం తలమింద సేతులు బెట్టుకోని యాడత్తా వుంది. అది కనబడంగానే నా కడుపులో కుండెడంబలి పోసినట్లు సల్లంగా అయింది.

''బుద్ధిలేని పన్జేసి నీ నోట్లో నువ్వు దుమ్ము గొట్టుకోని పిలకాయల నోట్లో కూడా దుమ్ము కొట్టొద్దు. పోయినోళ్లతో మనమూ పోవాలనుకుంటే ఈ బూమ్మింద మనసులే మిగ్రలు'' అనింది నాగి కోడలి మూతి మింద పొడస్తా.

ఆ మాటిల్నిని గోపాలంగాని పెండ్లాం మళ్లీ ఏడుపెత్తుకొనింది. ''నేంజస్తే మిగిలిన పిలకాయిలకు గంజినీళ్లు పోసే దిక్కుండదని నాకు మాత్రం తెల్దా. నేను సావను బోలేదు. నా బిడ్డి పానం నన్ను సూడాలని సచ్చిన చోట తారట్లాడతా వుంటుందని బొయినాను. మనూర్లో పిల్లి పిత్తిందని వొగరంటే కాదు కాదు పులి పిత్తిందంటూ ఇంగొకరంటారు. నా బిడ్నీ జూసుకోని నేను బతకాలనుకుంటే నన్ను అగుడు జేస్తారా'' అంటూ సిన్న కొడుకును వొళ్లోకి లాక్కుంది.